సాక్షి తిరుపతి

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. - 8లో



గణపయ్య రథోత్సవం

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారికి సోమవారం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	24
చిత్తూరు	33	23
తిరుమల	29	21
గూడూరు	35	26
నగరి	35	25

రథోత్సాహం

- వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- రథంపై ఊరేగిన వైకుంఠనాథుడు
- దేవదేవుని సేవలో తరించిన భక్తులు
- అశ్వవాహనంపై విహరిస్తూ కల్కి కటాక్షం
- నేడు చక్రస్నానం.. ధ్వజావరోహణం

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ఉదయం ఉభయదేవేరీ సమేత మలయప్పస్వామివారికి అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. మాడ వీధుల్లో భక్తులు గోవిందా... గోవిందా అంటూ మహారథాన్ని ఉత్సాహంగా ముందుకులాగారు. రథసేవలో దేవదేవుడిని దర్శించినవారికి ముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. స్వామివారు సోమవారం రాత్రి అశ్వవాహనంపై మలయప్ప కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం ఉదయం 3 గంటల నుంచి పల్లకి, తిరుచ్చి ఉత్సవాలు నిర్వహిస్తారు. శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామివారికి, చక్రతాళ్వారులకు స్నపన తిరుమంజనం జరిపిస్తారు. చక్రతాళ్వారుకు పవిత్ర పుష్కరిణిలో స్నానం చేయిస్తారు. రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం అవుతాయి.

అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించి భక్తులు ఆనందపరవశులయ్యారు. మహారథంపై కొలువైన తిరుమలేశుని దర్శించుకుని చరితార్థులయ్యారు. సాక్షాత్తు చతుర్ముఖుడే రథ సారథ్యం వహించిన అపురూప దృశ్యాన్ని మనోఫలకంలో నిక్షిప్తం చేసుకుని పులకించారు. అలంకార ప్రియుని అనంత తేజోవిరాట్ మూర్తిని సేవించుకుని పునీతులయ్యారు. తిరుగిరులు మార్మోగేలా గోవింద నామాలను స్మరిస్తూ తన్మయత్వం చెందారు. కల్కి అవతారంలో అశ్వరూఢుడై విహరిస్తున్న జగద్రక్షకుని ఎదుట పాహిమాం అంటూ మొకరిల్లారు. ముక్తిని ప్రసాదించమని దేవదేవుని మనఃపూర్వకంగా వేడుకుంటూ జన్మ సార్థకం చేసుకున్నారు.



అశ్వవాహనంపై కల్కి అవతారంలో శ్రీవారు



వాహనసేవలో అశ్వరాజాలు



శ్రీవారి సేవలో వైవీ స్వర్ణలతమ్మ



శ్రీవారికి నమస్కులర్పిస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దంపతులు



అశేష భక్తజన సందోహం నడుమ శ్రీవారి రథోత్సవం



శ్రీహరి వేషధారి



దేవతల వేషధారణలో కళాకారులు



కళాకారిణి నృత్య భంగిమ



శ్రీమహావిష్ణువు, ఆదిలక్ష్మి రూపంలో కళాకారులు



చిన్నికృష్ణుడు.. గోపికల అవతారంలో ప్రదర్శన

న్యూస్‌రీల్

నిర్ణీత గడువులో సమస్యల పరిష్కారం



అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : స్పందన కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా తెలియజేసే సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని, ఏమైనా ఇబ్బందులుంటే వాటికి మార్గాలు నిర్దేశించాలని సూచించారు. స్పందనకు వచ్చే వినతుల్లో అధికంగా భూ సమస్యలపైనే ఉన్నాయని, రీసర్వే పూర్తయితే అవి కచ్చితంగా తగ్గుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, ఏపీఐఐసీ అధికారి శ్రీనివాసులు, ప్రోటోకాల్ అధికారి భాస్కర్‌నాయుడు, కలెక్టరేట్ ఏఓ జయరాములు పాల్గొన్నారు. స్పందనకు వివిధ సమస్యలపై మొత్తం 162 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

ప్రజల కోసమే 'ఫిష్ ఆంధ్ర'



ఫిష్ ఆంధ్ర యూనిట్ ప్రారంభిస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి

కోట : మత్స్య సంపదను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకే ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర దుకాణాలు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం కోటలో డీఎఫ్‌ఓ శ్రీనివాసన్‌తో కలిసి ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. డీఎఫ్‌ఓ మాట్లాడుతూ కోటలో రూ.10లక్షల వెచ్చించి ఫిష్ ఆంధ్ర రెడీ టూ ఈట్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీనికి 60శాతం సబ్సిడీని ప్రభుత్వం అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ రాజేష్, ఎఫ్‌డీఓ రెడ్యానాయక్ పాల్గొన్నారు.

రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్‌పై శిక్షణ



శిక్షణ శిబిరంలో వైద్యులు, ముఖ్యఅతిథులు

తిరుపతి తుడా : ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పని చేస్తున్న డెంటల్ అసిస్టెంట్ సర్జన్లకు రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్‌పై రుయా ఆసుపత్రి దంత విభాగంలో సోమవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. రుయా, ఎస్వీ మెడికల్ కాలేజ్ డెంటల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.స్వప్నప్రియ రిసోర్స్ పర్సన్‌గా ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ వారి ఆదేశాల మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన ప్రభుత్వాస్పత్రుల్లోని డెంటల్ అసిస్టెంట్ సర్జన్లకి హ్యాండ్స్ ఆన్ కోర్స్, పేషంట్ రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్‌పై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. దంత వైద్యులకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.చంద్రశేఖరన్ , రుయా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు, ఎస్వీ మెడికల్ కాలేజ్ అడ్మిన్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్, అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ జె.రాధా, పీఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

అందుబాటులో 'డ్రిప్' పరికరాలు



సతీష్, సూక్ష్మ సేద్య జిల్లా అధికారి

తిరుపతి అర్బన్ : రైతులకు అందుబాటులో డ్రిప్ పరికరాలు ఉన్నాయని జిల్లా సూక్ష్మ సేద్యం అధికారి సతీష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించి 5 వేల ఎకరాలకు అవసరమైన బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు మంజూరైనట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 610 మంది రైతులు 1,580 ఎకరాలకు మాత్రమే రాయితీపై సామగ్రి పొందారని వివరించారు. మరో 3,420 ఎకరాలకు కావాల్సిన పరికరాలు ఉన్నాయన్నారు. బిందు సేద్యానికి 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు 90శాతం రాయితీతో, 5 ఎకరాల పైన ఉన్నవారికి 70శాతం సబ్సిడీతో అందజేస్తామని తెలిపారు. తుంపర్ల సేద్యానికి 5 ఎకరాల లోపు వారికి 55శాతం, ఆపైన ఉంటే 45శాతం రాయితీతో పరికరాలను అందిస్తున్నట్లు వెల్లడించారు.

హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

బుచ్చినాయుడుకండ్రిగ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు మొత్తం 14 నియోజకవర్గాల నుంచి 640 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. డీఈఓ శేఖర్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ క్రమంలో అండర్–17, 14 విభాగాల్లో బాలబాలికలను 16 మంది చొప్పున ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ నరసింహరావు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 3 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 66,598 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,103 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.88 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

తిరువణ్ణామలైకి 94 బస్సులు

తిరుపతి అర్బన్ : పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని తిరువణ్ణామలైకి 94 బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో 90 బస్సులు, ఒక అమరావతి, మూడు ఇంద్ర ఏసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఏపీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మొబైల్ నుంచి రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం ఉందని వివరించారు. తిరుపతి, వెంకటగిరి, వాకాడు, సూళ్లూరుపేట, సత్యవేడు, పుత్తూరు నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇతర వివరాల కోసం 9959225684, 9959225686 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలకు శ్రీకారం



స్వామి, అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలకు సోమవారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు.అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి వేడుకగా స్నపన తిరుమంజనం చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకించారు. తెలిసీ తెలియక జరిగే దోషాలతో ఆలయ పవిత్రతకు లోపం రాకుండా ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. డిప్యూటీ ఈఓ శాంతి, ప్రధాన అర్చకుడు ఏపీ శ్రీనివాస దీక్షితులు, ఏఈఓ మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైభవం.. రథోత్సవం

- ఘనంగా తుమ్మలగుంటలో కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- అశ్వవాహనంపై మలయప్పస్వామి దర్శనం
- శ్రీవారి సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు
- నేడు చక్రస్నానం..ధ్వజావరోహణం



తుమ్మలగుంట కల్యాణ వెంకన్న రథోత్సవంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు సోమవారం అశేష భక్తజనసందోహం నడుమ శ్రీవారి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవర్లను అలంకార మండపానికి వేంచేపు చేశారు. బ్రహ్మరథంపై కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి భక్తులకు అభయం ఇచ్చారు. పురవీధుల్లో రథంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు తన్మయత్వం చెందారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అశ్వవాహనంపై దేవదేవుడు విహరించారు. అభయ హస్తంతో భక్తులను కటాక్షించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, బాల వినాయక కమిటీ చైర్మన్ హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు.

సారె సమర్పించిన పల్లె ప్రజలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ రకాల వాహనాలపై ఊరేగుతున్న స్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ పంచాయతీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తుమ్మలగుంటకు తరలి వస్తున్నారు. సోమవారం రథోత్సవానికి తిరుపతి రూరల్ మండలం పేరూరు, తుమ్మలగుంట, పాతకాల్వ, వెంకటపతినగర్ పంచాయతీల నుంచి భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి స్వామి వారికి సారె సమర్పించారు. వారికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వాగతం పలికారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నదానం చేశారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో ఆఖరు ఘట్టమైన చక్రస్నానం వేడుకలను మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 7.20 నుంచి 9.10గంటల నడుమ పుష్కరిణిలో చక్రస్నానం పూర్తి చేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ధ్వజావరోహణంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.



అశ్వవాహన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు, కలెక్టర్ వెంకటరమణారెడ్డి



స్వామివారి రథం లాగుతున్న వేదపాఠశాల విద్యార్థులు

చక్రస్నానం.. భద్రత కట్టుదిట్టం

- పుష్కరిణి వద్ద పకడ్బందీ ఏర్పాట్లు
- తొక్కిసలాట లేకుండా గ్యాలరీలు
- భక్తులు సహకరించాలంటున్న పోలీసులు


మాట్లాడుతున్న ఏఎస్పీ మునిరామయ్య

చంద్రగిరి:శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవా ల్లో భాగంగా మంగళవారం ఉదయం చక్రస్నానం నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్ట మైన భద్రత కల్పించినట్లు అదనపు ఎస్పీ మునిరామయ్య తెలిపారు. సోమవారం తిరుమలలోని పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆయన బందోబస్తు విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ శ్రీవారి చక్రస్నానంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. శ్రీవారి పుష్కరిణి పరిసర ప్రాంతాలలో భక్తులను స్టెరిలైజ్ చేసుకుంటూ గ్యాలరీల్లోకి పంపించాలని సూచించారు. అనంతరం ప్రతి భక్తుడు శ్రీవారి పుష్కరిణిలో జరిగే చక్రస్నాన మహా ఘట్టంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. భక్తులు ఎవరూ మాడవీధుల్లో కాకుండా నిర్దేశిత గ్యాలరీల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చక్రస్నానం జరిగే సమయంలోనే శ్రీవారి పుష్కరిణిలోకి అనుమతించాలని స్పష్టం చేశారు. చక్ర స్నాన పుణ్య ఘడియలు ఆ రోజంతా ఉంటాయనే విషయంపై భక్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్యాలరీల నుంచి పుష్కరిణిలోకి వెళ్లే సమయంలో భక్తులు తొక్కిసలాట లేకుండా ఒకరికొకరు సహకరించుకునేలా చూడాలని తెలిపారు. పుష్కరిణిలో స్నానమాచరించేటప్పుడు వృద్ధులను ఓ కంట కనిపెట్టుకుంటూ ఉండాలని చెప్పారు. ఈ క్రమంలో పుష్కరిణిలోకి చిన్నపిల్లలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

అనుమానితులపై ప్రత్యేక నిఘా

చక్రస్నానం రోజున భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో క్రైమ్ పార్టీ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పాత నేరస్తులు, అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. మహిళా భక్తులు తమ విలువైన ఆభరణాలపై జాగ్రత్త వహించాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ కాటమరాజు పాల్గొన్నారు.

అంగరంగ వైభవం.. గణపయ్య రథోత్సవం


అశేష భక్తజనం మధ్య కదులుతున్న స్వామివారి రథం


రథంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులు

కాణిపాకం(యాదమరి): జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన వరసిద్ధుని క్షేత్రంలో సోమవారం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. పలు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చిన భక్త జనం గణేశ నామస్మరణతో రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. భక్తులతో కాణిపాకం వీధులు కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక అలంకరణలో రథంపై కొలువుదీరిన వరసిద్ధి వినాయక స్వామి పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అంతకుముందు ఉభయదారుల ఆధ్వర్యంలో మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం చేసి పూజలు చేసి దర్శనం కల్పించారు. అనంతరం అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అభిషేకాలు చేసి సుగంధ పుష్పాలతో అలకరించి పూజలు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించి గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఏఈఓ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఉభయదారులు పాల్గొన్నారు.

నేడు స్వామివారి కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం బిక్షాండి కార్యక్రమం, అనంతరం స్వామివారి కల్యాణం, రాత్రి అశ్వవాహనంపై ఉత్సవ మూర్తులు ఊరేగనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు.

వర్షంలోనూ కదిలిన స్వామివారి రథం

కాణిపాకం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం అశ్వములు, ద్వారపాలకులను, పుష్పాలను స్వామి రథానికి అలంకరించారు. అనంతరం పుణ్యాహవచనం, వాస్తు, రథసారథి ప్రతిష్ఠ, రథబలి, కూష్మాండ బలి, పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయ అధికారులు, ఉభయదారులు భుజాలపై మోసుకుంటూ వచ్చి రథంలో కొలువుదీర్చారు. ఉదయం 9 గంటలకు సంప్రదాయబద్ధంగా కొద్ది దూరం లాగారు. స్వామివారి రథం ముందు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం రథంపై ఆసీనులైన సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి మధ్యాహ్నం 2 గంటలకు ముందుకు కదిలారు. అప్పుడు తేలికపాటి వర్షం ప్రారంభమైంది. అయినా భక్తులు లెక్క చేయకుండా స్వామివారి నామస్మరణ మధ్య రథాన్ని ముందుకు కదిలించారు. మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో, లంబాడీ, కళాకారుల నృత్యాల మధ్య రథం ముందుకు సాగింది. భక్తులు రథంపై మిరియాలు, బొరుగులు చల్లి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు బాబు, ఉభయదారులు కీర్తి శేషులు ఎత్తిరాజుల నాయుడు కాకర్లవారిపల్లె వారి జ్ఞాపకార్థం వారి కుమార్తె శ్రీమతి మీనాకుమారి, ఎన్ శివప్రసాద్ నాయుడు, కె.పూర్ణచంద్రారెడ్డి మాజీ వీఎం కాణిపాకం, కీర్తి శేషులు చంద్రశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు హరిప్రసాద్ రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

భారీ బందోబస్తు

స్వామివారి రథోత్సవం సందర్భంగా బుధవారం చిత్తూరు అడిషనల్ ఎస్పీ సుధాకర్ చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. అనంతరం రథం ఊరేగింపులో తనిఖీలు చేశారు. ఆలయం వద్ద అనుమానిత వ్యక్తులను గుర్తించడానికి డ్రోన్‌లతో తనిఖీలు చేశారు.


రథోత్సవంలో కళాకారుల ప్రదర్శన

తిరుమల ఘాట్‌లో రెండు ప్రమాదాలు


చెట్టును ఢీకొన్న కారు

చంద్రగిరి: తిరుమల మొదటి ఘాట్‌లో సోమవారం వేర్వేరు చోట్ల రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వివరాలు.. తిరుమల నుంచి కూలీలతో వస్తున్న వ్యాను 27వ మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి పిట్టగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. అలాగే శ్రీవారి దర్శనానంతరం కిందకు వస్తున్న కర్ణాటకు చెందిన స్విఫ్ట్ డిజైర్ కారు 30వ మలుపు వద్ద చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు పల్లం విద్యార్థి


పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఏర్పేడు : మండలంలోని పల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మోహనాచారి అండర్-14 రెజ్లింగ్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం నున్న విద్యా సంస్థల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్ జిల్లాల రెజ్లింగ్ అండ్-14 రాష్ట్ర స్థాయి పోటీల్లో మోహనాచారి బంగారు పతకం సాధించినట్లు వెల్లడించారు. అలాగే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి నాగరాజు కాంస్య పతకం దక్కించుకున్నట్లు వివరించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ పుష్పవాణి, రాజశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గూడూరు విద్యార్థిని


ఆర్తి

గూడూరురూరల్ : పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి ఎల్.ఆర్తి అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచినట్లు వెల్లడించారు. అక్టోబర్‌లో వైఎస్సార్ కడప జిల్లాలో జరగనున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని వివరించారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు


ఉత్సవర్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు


విశేష పూజలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సభ్యులు, వేద పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సారథ్యంలో ఐదు రోజులపాటు వీటిని నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. నిత్య పూజల్లో తెలిసో, తెలియకో జరిగే దోషాల నివారణకు ప్రతి ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. తొలిరోజు ఆలయ స్థానాచార్యులు స్వామినాథన్ గురుకుల్, వేద పండితులు పూజలు చేశారు. యాగశాల వద్ద వేదిక వద్ద రంగు రంగుల ముగ్గులు వేసి, యాగశాల గోడలకు నటరాజస్వామి ప్రతిమను చిత్రించారు . వేదమంత్రోచ్చరణల మధ్య వేదిక మీద కలశ స్థాపన చేసి హోమం చేశారు. దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి ఉత్సవమూర్తులు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి, వివిధ రకాల పూజ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. విశిష్ట అలంకారాలు చేశారు. ధూప దీప నైవేద్యాలు నివేదించి, పూర్ణ హారతులు సమర్పించారు.


దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి

దేవతల పునరుత్తేజం కోసమే పవిత్రోత్సవాలు

అంజూరు మాట్లాడుతూ, ఆలయంలో మూల విరాట్టులకు పునరుత్తేజం కోసం ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రాంతాలన్నీ సస్యశ్యామలంగా ఉండాలని, భక్తులకు దేవత మూర్తుల ఆశీస్సులు లభించి, వారి కోర్కెలు ఫలించాలని, దేవదేవుని ఆశీస్సులు లభించాలని సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి వాణి, బియ్యపు పవిత్రా రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు కొండూరు సునీత, పసలు సుమతి ప్రత్యేక ఆహ్వానితులు, శ్రీదేవి, దేవస్థాన ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, దేవస్థాన అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూకరత్నం,డిప్యూటీ ఈఓ జే.వెంకట సుబ్బయ్య, ఏఈఓ ధనపాల్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్ నాయుడు, వేద పండితులు ప్రభాకర్ శర్మ, హేమంత్ కుమార్, ఆలయ అర్చకులు శ్రీనివాసన్ గురుకుల్, పరిచారకులు గోవింద్ శర్మ తదితరులు పాల్గొన్నారు


పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు


ప్రత్యేక అలంకరణలో గురు దక్షిణామూర్తి

నేడు పైలెట్ హెల్త్ క్యాంపు

చిత్తూరు రూరల్/తిరుపతి తుడా: జిల్లాలో ఆరోగ్య సురక్ష సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 30వ తేదీ నుంచి మెగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ట్రయల్ రన్ చేపడుతోంది. పైలెట్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మోజీపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెల్త్ క్యాంపును నిర్వహించనుంది. తిరుపతి రూరల్‌లోని దామినేడు పీహెచ్‌సీ మల్లవరం పీహెచ్‌సీలో హెల్త్ క్యాంపు నిర్వహించనున్నారు. దీనికి అవసరమైన మందులు తదితర అన్ని ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఆరోగ్య శిబిరాల్లో 162 రకాల మందులు, 18 రకాల శస్త్ర చికిత్స పరికరాలు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు అందుబాటులో ఉంచారు. ఆరోగ్య శిబిరానికి విలేజ్ క్లినిక్ సిబ్బంది, పీహెచ్‌సీ వైద్యులు, ఇద్దరు స్పెషలిస్టులు హాజరు కానున్నారు.

ఆర్మీ సెలెక్షన్స్‌లో ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విజయఢంకా


ఆర్మీ సెలెక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులతో అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి

తిరుపతి రూరల్: గుంటూరులో ఈనెల 24న నిర్వహించిన ఆర్మీ సెలెక్షన్స్‌లో తిరుపతి ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాల్లో విజయదుందుభి మోగించినట్లు అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతిలోని అకాడమీలో ఆర్మీ సెలెక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ సెలెక్షన్స్‌లో అకాడమీకి చెందిన 85 మంది విద్యార్థులు వివిధ విభాగాలకు ఎంపికైనట్లు తెలిపారు. టెక్నికల్-17, జీడీ-66, ట్రేడ్స్‌మెన్-2 ఇలా మొత్తం 85 మంది సెలక్ట్ అయినట్లు చెప్పారు. అకాడమీలో విద్యతో పాటు డిఫెన్స్‌లో ఉద్యోగాలు సాధించేందుకు శారీరక, మానసిక, సాంకేతిక, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు అకాడమీలో ఉచిత విద్యను అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.